క్లుప్తంగా

గోమాత పూజతో సకల శుభాలు



గోపూజ నిర్వహిస్తున్న అర్చకులు

నాగలాపురం: గోమాతకు పూజ చేస్తే సకల శుభాలు చేకూరుతాయని శ్రీపల్లికొండేశ్వర స్వామి దేవస్థానం ఈఓ కె.రామచంద్రారెడ్డి తెలిపారు. మండలంలోని సురుటుపల్లిలో ప్రసిద్ధిగాంచిన శ్రీసర్వమంగళ సమేత శ్రీపల్లి కొండేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం ఉదయం 6 గంటలకు దేవస్థానం ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా గోపూజ చేశారు. పూజల్లో పాల్గొన్న ఈఓ మాట్లాడుతూ ఆలయంలో ప్రతి శుక్రవారం గోపూజ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గోపూజ చేస్తే ఆర్థిక సమస్యలు తొలగిపోవడం, సకల సంపదలు, సంతాన ప్రాప్తి, ఉన్నత విద్య, అష్ట ఐశ్వర్యాలు కలుగుతాయని పురాణాలు చెబుతున్నాయన్నారు. భక్తుల సౌకర్యార్థం ప్రతి శుక్రవారం ఆలయంలో గోపూజ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం పూజల్లో పాల్గొన్న అశేష భక్తులకు అర్చకులు సతీశ్ శర్మ, గణేష్ శర్మ, తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

వైభవంగా అభిషేక పూజలు



ఉయ్యాల సేవలో అమ్మవారు

నారాయణవనం: మండల కేంద్రంలో టీటీడీ అనుబంధ శ్రీపద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం ఉదయం అభిషేక పూజలు, సాయంత్రం ఊంజల్ సేవ వైభవంగా జరిగాయి. తెల్లవారు జామున సుప్రభాత సేవతో ఆలయాన్ని తెరచిన అర్చకులు నిత్య పూజాకైంకర్యాలను చేశారు. ఉదయం 7 గంటలకు శ్రీవేంకటేశ్వరస్వామికి, 8 గంటలకు శ్రీపద్మావతీ అమ్మవారికి శుక్రవార అభిషేకాలను పూర్తి చేశారు. సాయంత్రం శ్రీపద్మావతీ అమ్మవారి ఉత్సవమూర్తిని పట్టుపీతాంబరాలు, పరిమళభరిత పుష్పమాలికలు, విశేష ఆభరణాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి తిరుచ్చి వాహనంపై అధిష్ఠింపజేశారు. తదుపరి అంతర ప్రాకారంలో అమ్మవారిని ఊరేగింపుగా ఊంజల్ మండపానికి తీసుకొచ్చి ఉయ్యాలపై కొలువుదీర్చారు. వేదనాద కచేరి నడుమ ఊంజల్ సేవలో అమ్మవారు పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఆలయ అధికారి నాగరాజు, ఆర్జితం అధికారి భరత్, అర్చకులు శ్రీనివాస భట్టాచార్యులు పర్యవేక్షించారు.

కెనడాలో ఎంఎస్ పట్టా

శ్రీకాళహస్తి: పట్టణానికి చెందిన అరుణ మెడికల్స్ అధినేత రామగుప్త చిన్నకుమార్తె సాయి కీర్తి కెనడాలోఎంఎస్‌లో పట్టా సాధించింది. కెనడాలోనే రెండవ అతిపెద్ద యూనివర్సిటీలో ఎంఎస్ స్ట్రక్చర్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో పట్టా పొందింది. 161 సంవత్సరాలుగా నడుస్తున్న ఈ యూనివర్సిటీలో సాయి కీర్తి పట్టా పొందడంపై పలువురు అభినందించారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ మాధవి

బుచ్చినాయుడుకండ్రిగ: మండల కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రిలో సోమవారం ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు వైద్యాధికారి మాధవి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భం దాల్చిన వెంటనే ఏఎన్ఎం వద్ద పేరు నమోదు చేసుకోవాలని, క్రమం తప్పకుండా రక్త పరీక్షలు చేసుకుని, రక్తహీనత రాకుండా మందులను వాడాలన్నారు. ఆస్పత్రిలో కాన్పు అయితే జననీ సురక్ష కింద రూ.వెయ్యి, వైఎస్సార్ ఆసరా పథకం కింద రూ.4000 ఇస్తారని తెలిపారు.

జోరుగా హైస్కూల్ అడ్మిషన్లు



అడ్మిషన్ల కోసం వచ్చిన విద్యార్థుల తల్లిదండ్రులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల అడ్మిషన్లు పెద్ద సంఖ్యలో జరుగుతున్నట్లు, గత వారం రోజుల్లో 85 మంది అడ్మిషన్ తీసుకున్నట్లు ప్రధానోపాధ్యాయుడు రమణయ్య తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ బడి బయట పిల్లలను గుర్తించి, వారందరినీ పాఠశాలలో చేర్పించే విధంగా చైతన్య పరుస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్యతోపాటుగా మధ్యాహ్న భోజనం, ఉచితంగా పాఠ్య పుస్తకాలు, యూనిఫాం, బెల్ట్, నోట్‌బుక్స్, డిక్షనరీ, బూట్లు, సాక్సులు ప్రభుత్వం అందిస్తున్నట్లు వివరించారు.

నారాయణవనం: ధ్యానం చేస్తున్న ఇంజినీరింగ్ విద్యార్థులు



పిచ్చాటూరు : వెంగళత్తూరులో ..



బీఎన్‌కండ్రిగలో..



తొట్టంబేడు: ఆసనాలు వేస్తున్న విద్యార్థులు



ఆనందం..ఆరోగ్య యోగం

శ్రీకాళహస్తి: యోగాతో మానసిక ప్రశాంతత.. ఆరోగ్యం లభిస్తుందని యోగా గురువు భాస్కర్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం జరిగింది. శివసాయి యోగా సెంటర్ వ్యవస్థాపకులు సుజాత, యోగా గురువు భాస్కర్, ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.శ్రీలత, అధ్యాపకులు నరసింహవర్మ, సత్యనారాయణరెడ్డి, బాపనయ్య తదితరులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని బాబూఅగ్రహారం మున్సిపల్ హైస్కూల్‌లో కూడా యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. స్కౌట్ అండ్ గైడ్ కమిషనర్ పార్వతి, మాస్టర్ యోగానంద్ తదితరులు పాల్గొన్నారు.

శుకబ్రహ్మాశ్రమంలో

పట్టణంలోని శుకబ్రహ్మాశ్రమం వద్ద శుక్రవారం బీజేపీ ఆధ్వర్యంలో యోగా కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ఆశ్రమ పీఠాధిపతి విద్యాస్వరూపానందగిరిస్వామిని ఘనంగా సత్కరించారు. అనంతరం పట్టణానికి చెందిన పలువురు యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ మాట్లాడుతూ యోగా మన ప్రాచీన కాలం నుంచి ఉందన్నారు. నాయకులు మేళాగారం సుబ్రహ్మణ్యంరెడ్డి, గరికపాటి రమేష్‌బాబు, సుకుమార్, అమర్‌నాథ్, కొండేటి గోపాల్, వాసుయాదవ్, డిల్లీకుమార్, భరత్‌కుమార్‌నాయుడు, హరీష్‌రెడ్డి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

దినచర్యలో భాగం కావాలి

నారాయణవనం: స్థానిక సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాలతో పాటు ప్రభుత్వ పాఠశాలల్లో యోగా దినోత్సవం సందర్భంగా ఆసనాలను అభ్యసనం చేశారు. సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాలలో చైర్మన్ డాక్టర్ అశోకరాజు జ్యోతి ప్రజ్వలతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆడిటోరియంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మానసికంగా, శారీరకంగా మనిషిని యోగా ఉత్తేజం చేస్తుందన్నారు. స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులు గంటకు పైగా ఆసనాలతో అభ్యసనం చేశారు.



నారాయణవనం: బాలుర ఉన్నత పాఠశాలలో..

నాగలాపురంలో..

నాగలాపురం: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్లస్‌లో ఎంఈఓలు బాబయ్య, జనార్దన్‌రాజు ఆధ్వర్యంలో యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. వ్యాయామ ఉపాధ్యాయులు బాబు, నరేంద్ర విద్యార్థులతో ఆసనాలు వేయించారు. హెచ్ఎం కస్తూరయ్య పాల్గొన్నారు.

యోగాతో పరిపూర్ణ ఆరోగ్యం

తొట్టంబేడు : యోగాసనాలతో పరిపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చని ఎస్‌పీఏ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సుధాకర్ అన్నారు. తొట్టంబేడు పంచాయతీ పరిధిలోని కళాశాల ప్రాంగణంలో యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. ఎస్‌ఎస్ పీవో రేణుకమ్మ, బ్రహ్మకుమారిల ప్రతినిధి రమణి, అధ్యాపకులు పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యం

బుచ్చినాయుడుకండ్రిగ: బుచ్చినాయుడుకండ్రిగ, కల్లివెట్టు జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు యోగాపై అవగాహన కల్పించి, ఆసనాలు నేర్పించారు. ఈ సందర్భంగా ఎంఈఓలు రవీంద్రనాథ్, మునిసుబ్రమణ్యం మాట్లాడుతూ యోగాతో ఏకాగ్రత వస్తుందని తెలిపారు. హెచ్ఎం రమణయ్య, రూపేష్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వరదయ్యపాళెంలో..

వరదయ్యపాళెం: యోగాతో సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చని భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు చంద్రప్ప అన్నారు. యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం వరదయ్యపాళెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో లోకా ఫౌండేషన్ ఆధ్వర్యంలో యోగాసనాలు కార్యక్రమాన్ని చేపట్టారు. ఫౌండేషన్ ప్రతినిధులు లక్ష్మి, అరుణ్ దాసాజీలు ఆసనాలను వేయించారు. ప్రిన్సిపాల్ పద్మావతి, కేవీ గురుదేవ్, సిద్ధలయ్య, భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు. అలాగే స్థానిక హైస్కూల్ ప్లస్‌లో అభయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. ట్రస్టు చైర్మన్ బాలచంద్ర యోగా ప్రాముఖ్యతను వివరించారు. హెచ్ఎం రమణయ్య విజ్ఞప్తి మేరకు పాఠశాల అభివృద్ధికి చేయూత ఇస్తామని బాలచంద్ర తెలిపారు.

సత్యవేడులో..

సత్యవేడు : పుదుకుప్పం జెడ్పీ తమిళ ఉన్నత పాఠశాలలో యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు యోగా ప్రాధాన్యాన్ని వివరించారు. ఉపాధ్యాయులు జయంతి, ప్రేమ్‌కుమార్, జగదీష్, ఆంటోని, ఏకాంబరం, గ్రేసీప్రతిమ విద్యార్థులతో ఆసనాలు వేయించారు.

యోగాను అలవరుచుకోవాలి

పిచ్చాటూరు: విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరు యోగా సాధన అలవర్చుకోవాలని పుత్తూరు డీవైఈఓ ప్రభాకర్ రాజు పేర్కొన్నారు. మండలంలోని పిచ్చాటూరు, వెంగళత్తూరు జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో శుక్రవారం యోగా దినోత్సవం ఘనంగా జరిగింది. పిచ్చాటూరులో డీవైఈఓ ప్రభాకర్ రాజు పాల్గొని ప్రసంగించారు. యోగా సాధన వల్ల కలిగే ఉపయోగాలను వివరించారు. ఎంఈఓలు హేమమాలినీ, యుగంధర్ రాజు పాల్గొన్నారు.

ఏర్పేడు మండలంలో..



యోగా చేస్తున్న ఉపాధి కూలీలు

ఏర్పేడు: మండలంలోని బండారుపల్లె, అముడూరులో ఉపాధిహామీ పథకంలో ఏర్పాటు చేసిన అమృత్ సరోవర్ వద్ద అధికారులు యోగాపై కూలీలకు అవగాహన కల్పించారు. నిరంతరం యోగా చేస్తే సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని సూచించారు. అనంతరం కూలీలకు పలు వ్యాయామ ప్రక్రియలు నేర్పించారు. కార్యక్రమంలో ఏపీఓ దేవరి, జేఈ బాలాజీరావు, సాంకేతిక, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.









వరదయ్యపాళెం: ఆసనాలు వేస్తున్న విద్యార్థులు, శ్రీకాళహస్తి : శుకబ్రహ్మాశ్రమంలో పీఠాధిపతిని సన్మానిస్తున్న బీజేపీ నాయకులు, యోగా విశిష్టతను వివరిస్తున్న గురువులు

సత్యవేడు: పుదుకుప్పంలో..

బడి బయట పిల్లలు స్కూల్లో చేరిక



బడి బయట పిల్లలను బడికి తీసుకొస్తున్న ఎంఈఓలు

బుచ్చినాయుడుకండ్రిగ: స్థానిక పంచాయతీ పరిధిలోని తంగెళ్లపురం గిరిజన కాలనీలో బడి బయట ఉన్న ముగ్గురు పిల్లలను ఎంఈఓలు రవీంద్రనాథ్, మునిసుబ్రమణ్యం పాఠశాలలో చేర్పించారు. శుక్రవారం గిరిజన కాలనీలో పర్యటించి, బడి బయట ఉన్న పిల్లలను వారు గుర్తించారు. తల్లిదండ్రులను ఒప్పించి పాఠశాలలో చేర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ విద్యాహక్కు చట్ట ప్రకారం బడిఈడు పిల్లలు బడి బయట ఉండకూడదని, తప్పనిసరిగా బడిలో చేర్పించాలని తెలిపారు. పీడీ మస్తాన్ పాల్గొన్నారు.

నందీశ్వరునిపై నెలవంక

నాగలాపురం మండలం సురుటుపల్లిలో ప్రసిద్ధ శ్రీసర్వమంగళ సమేత పల్లికొండేశ్వర స్వామి ఆలయ మహా నందీశ్వరునిపై పౌర్ణమి సందర్భంగా చంద్రుడు ప్రత్యక్షమయ్యాడు. రాత్రి 7 గంటల సమయంలో నందీశ్వరుని రెండు కొమ్ముల నడుమ చంద్రుడు దర్శనమిచ్చాడు. తిలకించిన భక్తులు పారవశ్యంతో దర్శించుకున్నారు.

– నాగలాపురం



బైక్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

చిట్టమూరు(చిల్లకూరు) : చిట్టమూరు మండలం కలుగుర్తిపాడు సమీపంలో శుక్రవారం ఆర్టీసీ బస్సు బైక్‌ను ఢీకొనడంతో ఒకరు గాయపడ్డారు. స్థానికుల కథనం మేరకు.. కలుగుర్తిపాడు గ్రామానికి చెందిన నవీన్ బైక్‌పై సూళ్లూరుపేట బయలుదేరాడు. కలుగుర్తిపాడు సమీపంలో సూళ్లూరుపేట నుంచి కోటకు వెళుతున్న వాకాడు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు బైక్‌ను ఢీకొంది. దీంతో నవీన్ గాయపడ్డాడు. గమనించిన స్థానికులు ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. యువకుడిని ఆస్పత్రికి తరలించారు. ఈ విషయమై తమకు ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

ఘనంగా చండీ హోమం



పూర్ణాహుతి పూజల్లో పాల్గొన్న భక్తులు

చిల్లకూరు : తూర్పుకనుపూరులో వెలసిన ముత్యాలమ్మ ఆలయంలో శుక్రవారం పౌర్ణమి సందర్భంగా చండీ హోమాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రతి నెలా పౌర్ణమి రోజున చండీ హోమం నిర్వహించడం ఆనవాయితీ. ఈ క్రమంలోనే శుక్రవారం ప్రపంచంలో శాంతి నెలకొనాలని, ప్రజలు సుఖ సంతోషాలతో జీవించాలని కోరుతూ అర్చకులు, వేద పండితులు హోమం చేశారు. అనంతరం ముత్యాలమ్మ ఉత్సవ విగ్రహం వద్ద నవ కలశాలను ఏర్పాటు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. పూర్ణాహుతి అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు శివకుమారస్వామి, ఈవో నవీన్‌కుమార్, ట్రస్టు బోర్డు చైర్‌పర్సన్ సిద్ధారెడ్డి ఇంద్రసేనమ్మ, కమిటీ సభ్యులు దువ్వూరు చంద్రశేఖరరెడ్డి, ఉప్పల ప్రభాకర్ గౌడ్, పర్వతాల విమల తదితరులు పాల్గొన్నారు.



నవ కలశాలతో దర్శనమిస్తున్న ముత్యాలమ్మ ఉత్సవమూర్తి

శ్రీసిటీని సందర్శించిన తిరుపతి ఎస్పీ



ఎస్పీ హర్షవర్ధన్ రాజుకు మెమెంటో అందజేస్తున్న శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి

సత్యవేడు: తిరుపతి ఎస్పీ వి.హర్షవర్ధన్ శ్రీసిటీని సందర్శించారు. గురువారం రాత్రి మొట్ట మొదటిసారిగా శ్రీసిటీకి విచ్చేసిన ఆయనకు మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి సాదర స్వాగతం పలికి, శ్రీసిటీ ప్రగతి, ప్రత్యేకతలతో పాటు ఇక్కడ అనుసరిస్తున్న భద్రత విధానాలను వివరించారు. ఉద్యోగులు, విద్యార్థులు, విదేశీ ప్రతినిధులు అధిక సంఖ్యలో ఉన్న శ్రీసిటీ రక్షణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు తెలిపారు. ఎంతైనా ఉందని పేర్కొన్నారు. అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్‌ను సందర్శించి శాంతి భద్రతలపై సమీక్షించారు. శ్రీసిటీ డీఎస్పీ జీవీఎస్ పైడేశ్వరావు, సీఐ భాస్కర్, ఎస్ఐ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

కౌంటింగ్‌లో పోలీసుల పనితీరు స్ఫూర్తిదాయకం

శ్రీకాళహస్తి: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా పోలీసుల పనితీరు స్ఫూర్తిదాయమని లా అండ్ ఆర్డర్ అదనపు ఎస్పీ కులశేఖర్ అన్నారు. టీవీఎంకండ్రిగ సమీపంలోని ఆర్‌జీవీ కల్యాణ మండపంలో శుక్రవారం శ్రీకాళహస్తి, రేణిగుంట సబ్‌డివిజన్ పోలీసులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అంకితభావంతో పనిచేశారని అధికారులు, సిబ్బందిని పేరుపేరునా అభినందించారు అనంతరం వారికి విందు ఏర్పాటు చేశారు. డీఎస్పీ ఉమామహేశ్వర్‌రెడ్డి, రేణిగుంట డీఎస్పీ భవ్యకిషోర్, సీఐలు, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అగ్నిగుండ మహోత్సవం



పూజల్లో పాల్గొన్న భక్తులు

పెళ్లకూరు: నెలబల్లిలో వెలసిన పాండురంగస్వామి ఆలయం వద్ద శుక్రవారం అగ్ని గుండ మహోత్సవాన్ని గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు ఉపవాసం ఉండి కంకణధారణ చేశారు. అనంతరం తొమ్మిది సార్లు స్నానం ఆచరించారు. ఆలయ అర్చకుల మంత్రోచ్ఛరణల మధ్య అగ్నిగుండ ప్రవేశం చేశారు.

వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్‌గా ఎంవీ రమణ

తిరుపతి సిటీ: ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని తిరుపతి ఎస్వీ వ్యవసాయ కళాశాల నూతన అసోసియేట్ డీన్‌గా డాక్టర్ ఎంవీ రమణ బాధ్యతలు స్వీకరించారు. ఆయన గతంలో వ్యవసాయ ఇంజినీరింగ్ విభాగాధిపతిగా, ప్రొఫెసర్‌గా 30ఏళ్ల పాటు సేవలందించారు.

వైభవంగా బంగారమ్మ జాతర



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం

ఏర్పేడు: మండలంలోని నాగంపల్లె బంగారమ్మ ఆలయ జాతర శుక్రవారం వైభవంగా జరిగింది. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. గ్రామస్తుల ఆహ్వానం మేరకు ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం జాతర పూజల్లో పాల్గొన్నారు. గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికి సత్కరించారు.

ఎంపీ గురుమూర్తికి సన్మానం

తిరుపతి అంతర్జాతీయ విమానాశ్రయంలో ఎస్ఎంఆర్ హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ ఆధ్వర్యంలో తిరుపతి ఎంపీ డాక్టర్ మద్దిల గురుమూర్తికి ఘన సన్మానం జరిగింది. ఎంపీ ఢిల్లీకి వెళుతుండగా విమానాశ్రయంలో సంస్థ ప్రతినిధులు కలిసి శాలువలతో సన్మానించి, స్వీట్స్ తినిపించి అభినందనలు చేశారు. ఎస్ఎంఆర్ హెల్పింగ్ హ్యాండ్స్ అధినేత ధనుష్, ఐతేపల్లి గురునాథం, జీపీ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా పౌర్ణమి ఊంజల్‌సేవ

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో శుక్రవారం పౌర్ణమి ఊంజల్‌సేవ కనులపండువలా జరిగింది. మొదట ఆలయ అలంకార మండపంలో శ్రీస్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించారు. అనంతరం ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. ఊరేగింపుగా ఊంజలసేవ మండపానికి తీసుకువచ్చి ఊయలలో కొలువుదీర్చారు. వేదమంత్రోచ్ఛారణల నడుమ వెన్నెల కాంతుల్లో ఊయలలో సేదతీరుతున్న స్వామి,అమ్మవార్లను దర్శించి భక్తులు పారవశ్యం చెందారు.



ఊంజల్‌సేవలో స్వామి, అమ్మవార్లు

స్వర్ణముఖిలో దూకి యువతి ఆత్మహత్యాయత్నం

శ్రీకాళహస్తి: పట్టణంలోని స్వర్ణముఖి వంతెనపైనుంచి ఓ యువతి శుక్రవారం నదిలోకి దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. స్థానికులు గమనించి హుటాహుటిన నదిలోకి దిగి యువతిని బయటకు తీసుకువచ్చారు. అనంతరం ఆ యువతిని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఆస్పత్రికి చేరుకుని ఆమెను విచారించగా, తనపేరు దుర్గ అని, శ్రీకాకుళమని, శ్రీసిటీలో ఉద్యోగం చేస్తున్నట్లు తెలిపింది. పెళ్లకూరు మండలం పుల్లూరుకు చెందిన సురేంద్ర అనే యువకునితో ప్రేమ వ్యవహారంతో వచ్చిన మనస్పర్థలతో మనస్తాపం చెంది ఆత్మహత్యకు ప్రయత్నించినట్లు తెలిపింది. ప్రేమించిన యువకుడు, అతని తల్లిదండ్రులను పిలిచి పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చారు. రాజీ పడని పక్షంలో కేసు నమోదు చేస్తామని పోలీసులు తెలిపారు.



యువతిని వెలికి తెస్తున్న స్థానికులు

మట్టి నమూనాల సేకరణ

సూళ్లూరుపేట రూరల్ : సూళ్లూరుపేట మండలంలోని కోటపోలూరుకు చెందిన పలువురు రైతుల పొలాల నుంచి శుక్రవారం వ్యవసాయ అధికారులు మట్టి నమూనాలు సేకరించారు. ఏడీఏ అనిత మాట్లాడుతూ ప్రతి మండలంలోనూ 400 మట్టి నమూనాలను సేకరిస్తామ న్నారు. దీనిపై వ్యవసాయ సిబ్బంది, అధికారులకు శిక్షణా తరగతులు నిర్వహించామని పేర్కొన్నారు. సేకరించిన మట్టి నమూనాలను ల్యాబ్ కు తరలిస్తామని తెలిపారు. అదేవిధంగా పచ్చిరొట్ట విత్తనాలను 50 శాతం రాయితీతో రైతులకు అందజేస్తున్నట్లు వివరించారు. మండల ఏవో కవిత, వీఏఏలు గవాస్కర్, హిమబిందు, ఈశ్వర్, నాగరాజు పాల్గొన్నారు.



పొలాల్లో మట్టి నమూనాలు సేకరిస్తున్న వ్యవసాయ అధికారులు

కండలేరులో 6.382 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో శుక్రవారం నాటికి 6.382 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్ రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 5 క్యూసెక్కులు, పిన్నేరు వాగుకు 20, లోలెవల్ కాలువకు 40 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.